• మిర్చి రైతుకు భరోసా ఇవ్వని మార్పు!

ఎనుమాముల మార్కెట్ ప్రధాన గేటు వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

భగ్గుమన్న మిర్చి రైతు

వరంగల్, ఖమ్మంలో అమాంతం తగ్గిన ధర • తక్కువ ధరకు కొనుగోలుపై తీవ్ర ఆగ్రహం

వరంగల్ మార్కెట్‌లో వ్యాపారుల తీరుపై నిరసన

ప్రధాన రహదారిపై 2 గంటలు రాస్తారోకో

- గత వారం తేజ రకం క్వింటా రూ.23,600
- సోమవారం క్వింటాకు ధర రూ.20 వేలే
- నాణ్యత పేరుతో మిర్చి రైతుకు తీవ్ర నష్టం
- ఉట్టి చేతులతోనే పంట నాణ్యత నిర్ధారణ
- అధికారుల హామీతో శాంతించిన రైతులు
- నాలుగు గంటలు ఆలస్యమైన కాంటాలు

వరంగల్, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మిర్చి రైతులు భగ్గుమన్నారు. తేజ మిర్చి క్వింటాల్‌కు జెండా పాట రూ.20,100 కాగా, రకరకాల కారణాలు చెప్తూ రూ.12 వేల నుంచి రూ.17 వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారంటూ పలువురు రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు సుమారు 10 వేల మిర్చి బస్తాలు వచ్చాయి. ఇదే అదునుగా వ్యాపారులు మిర్చి ధరను అమాంతం తగ్గించారు. ముందుగా నిర్ణయించిన ధరలోనూ కోతలు పెట్టారు. జెండా పాటలో తేజ రకం మిర్చి క్వింటాకు రూ.20,100 నిర్ణయించారు. వ్యాపారులు రకరకాల కారణాలు చెప్పి క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.17 వేలకు కొనుగోలు చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యత సాకులు చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని, ముందుగా నిర్ణయించిన ధరనన్నా అందరికీ ఇవ్వాలని మిర్చి కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. అక్కడి నుంచి ర్యాలీగా మార్కెట్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి నిరసన తెలిపారు. మార్కెట్ ప్రధాన గేట్ వద్దకు చేరుకొని రెండు గంటలు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఎనుమాముల పోలీస్ ఇన్‌స్పెక్టర్ వచ్చి రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. మార్కెటింగ్, పోలీసు అధికారులు.. రైతులు, వ్యాపారులతో మూడు గంటలపాటు చర్చలు జరిపారు. తక్కువ ధరలు పడ్డ రైతుల సరుకును పరిశీలించి ధరలు పెంచేలా చేస్తామని, ధరలు నచ్చని రైతులు మరుసటి రోజు అమ్ముకోవాలని సూచించారు. అనంతరం తక్కువ ధరలు పడ్డ రైతుల సరుకులను పరిశీలించి కొంత వరకు ధరలు పెంచి కొనుగోళ్లు చేపట్టారు. నాలుగు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం నుంచి మిర్చి కాంటాలు యథావిధిగా కొనసాగాయి.

తీవ్ర నిరాశలో మిర్చి రైతు

ఖమ్మం మార్కెట్‌లోనూ మిర్చి ధర అమాంతం తగ్గిపోయింది. వారం రోజుల క్రితం ఖమ్మం మార్కెట్లో తేజ రకం మిర్చి క్వింటా రూ.23,600 పలికింది. సోమవారం రూ.21 వేలకు పడిపోయింది. రెండు రోజుల సెలవుల తర్వాత సోమవారం మార్కెట్‌కు 20 వేల బస్తాల మిర్చి పంటను రైతులు తీసుకొచ్చారు. జెండా పాటలో క్వింటాకు రూ.21 వేలు ఒక్క లాట్‌కే పలికింది. కొందరు రైతులకు రూ.18,500 మాత్రమే దక్కింది. సోమవారం మిర్చి పంటను మార్కెట్‌కు తెచ్చిన రైతుల్లో 80 శాతం మందికి క్వింటాకు రూ.15 వేల నుంచి రూ.16 వేలు మాత్రమే ధర దక్కింది. ఆశలతో పంటను యార్డుకు తీసుకొచ్చిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది.

వరంగల్ ఎనుమాములలో మిర్చి ధరలు (కింటాకు రూ.ల్లో)

రకం	గత ఏడాది	ప్రస్తుతం
వండర్ హాట్	30,000	20,500
యూఎస్ 341	21,000	17,000
తేజ రకం	23,000	20,500
తాలు	12,000	10,000

చేతులతోనే నాణ్యత నిర్ధారణ

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్కెటింగ్‌శాఖలో అనేక మార్పులు వచ్చాయి. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అవి అమలుకావడం లేదు. రైతులు, వ్యాపారులు, కార్మికుల సౌకర్యర్థం ఖమ్మం మార్కెట్‌లోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని కేసీఆర్ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. సీసీ పుటేజీల పర్యవేక్షణ, జీపీఆర్ఎస్ కాంటాలు, పత్తి క్రయవిక్రయాల్లో ఈ-నామ్ విధానం, మిర్చి క్రయవిక్రయాల్లో ఈ-టామ్ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. ఖమ్మం మార్కెట్‌లో రూ.36 లక్షలతో మూడు మిర్చి నాణ్యత యంత్రాలను సమకూర్చారు. మిర్చి పంటకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను ఖరారు చేయదు. దీనిని అసరాగా చేసుకుని వ్యాపారులు నాణ్యత పేరుతో ధరను నిర్ణయిస్తున్నారు. ఎలాంటి సాంకేతికతను వినియోగించకుండా చేతులతో పంటను ముట్టుకుని నాణ్యతను నిర్ధారిస్తున్నారు.

పంట లేదు, ఇటు రేటు లేదు

ఎకరన్నంలో మిర్చి సాగు చేసిన. నాలుగు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. మళ్లోసారి రెండు బస్తాలు రావచ్చు. లక్ష వరకు పెట్టుబడి పెట్టిన. క్వింటా 15,500 ధర పెట్టారు. పెంచాలని ఎంత అడిగినా ధర పెంచలేదు. అటు పంటకు రోగం వచ్చి ఆగమయ్యింది. ఇటు మార్కెట్ల ధర లేదు. ఏమి చేయాలో అర్థం అయితలేదు.

- భూక్యా సోమ్లా, ఎల్లంపేట, మరిపెడ

నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నరు

ఎకరంల మిర్చి పంట వేస్తే 6 బస్తాల తేజ రకం మిర్చి వచ్చింది. కూలీల ఖర్చు రూ.25 వేలు అయింది. క్వింటాకు రూ.10 వేలు అడుగుతున్నరు. ఈ ధరతో అమ్మితే మిర్చి ఏరిన కూలీల డబ్బులు కూడా వచ్చే టట్టు లేవు. వ్యాపారులు నాణ్యత పేరుతో ధరలు తగ్గించి నిలువు దోపిడీ చేస్తున్నరు. జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.

- చందాల సమ్మయ్య, నర్సంపేట

పెట్టుబడి వచ్చేటట్టు లేదు

మిర్చి పంటకు పెట్టుబడులు వచ్చేటట్టు లేవు. నిరుటి కంటే మిర్చి ధర తగ్గింది. తేజ రకం మిర్చి 17 బస్తాలు మార్కెట్‌కు తీసుకొస్తే క్వింటాకు రూ.11 వేలు అంటున్నరు. నాణ్యత పేరు చెప్పి ధర తగ్గిస్తున్నరు. ఎంత బతిమిలాడినా ధర పెంచుతలేరు.

- భూక్య రమేశ్, గూడూరు

మిర్చి రైతులను దోచుకుంటున్నారు..

వరంగల్ మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చే రైతులను దోచుకొనే పద్ధతి మారాలి. రైతులకు న్యాయం జరిగేలా అధికారులు తీసుకోవాలి. సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

- సోమిడి శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

అమ్ముకోలేక ఇంటికి

12 బస్తాల మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చిన. జెండాపాట తర్వాత నా పంటకు వ్యాపారులు క్వింటాకు రూ.15 వేలు అడిగిర్రు. మొన్నటి ధర చూసి పంటను తీసుకొచ్చిన. మరీ ఇంత తక్కువ ధర అడగడం సరికాదు. నాకు ఈ ధర నచ్చలేదు. తిరిగి ఇంటికి పంటను తీస్కపోతున్న. ధర పెరిగిన తరువాత తీసుకొస్త.

- రామారావు, మల్లుపల్లి, కొణిజర్ల

బ్రాహ్మణ పరిషత్ పథకాలకు బ్రేక్!

- నిధులు లేకపోవడంతో ముందుకు సాగని పథకాలు
- పాలకమండలి రద్దుతో నిలిచిన కార్యకలాపాలు

హైదరాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పథకాల లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సంక్షేమ పరిషత్ నుంచి ఆర్థిక సహాయం అందుతుందనే నమ్మకంతో అప్పులు చేసి వ్యాపారాలు ప్రారంభించిన వారు, వివిధ మార్గాల ద్వారా రుణాలు పొంది ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లిన వారు ఇప్పుడు అయోమయంలో పడ్డారు. పథకాలకు ఎంపికైన వారే కాకుండా వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకున్నవారు కూడా తమకు సంక్షేమ పరిషత్ పథకాలు వస్తాయా? రావా? అనే సందేహం వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అమలుచేస్తున్న పథకాల్లో పేద బ్రాహ్మణులకు ఆర్థికంగా చేయుత అందించి వారిని వివిధ వృత్తి, వ్యాపారాల్లో నిలదొక్కుకునేలా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన బ్రాహ్మిణ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కీమ్ ఆఫ్ తెలంగాణ(బెస్ట్), పేద బ్రాహ్మణ విద్యార్థులకు విదేశీ విద్యకోసం ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ఉద్దేశించిన వివేకానంద విదేశీ విద్యానిధి పథకం ముఖ్యమైనవి. బెస్ట్ పథకం కింద గత ఏడాది ఆగస్టులో నోటిఫికేషన్ ఇవ్వగా సుమారు 3,000 దరఖాస్తులొచ్చాయి. వీరిలో 700 మందికి ఇంటర్వ్యూలు, క్షేత్రస్థాయి తనిఖీలు పూర్తయ్యాయి. వివేకానంద విదేశీ విద్యానిధి పథకం కోసం దాదాపు 1,000 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 400 మందిని ఎంపికచేశారు. ఎంపికైనవారికి ఆర్థిక సహాయం అందించాల్సి ఉన్నది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందనే నమ్మకంతో విదేశీ విద్యానిధి పథకం లబ్ధిదారులు వివిధచోట్ల అప్పులుచేసి విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు వెళ్లారు. బెస్ట్ స్కీమ్‌కు ఎంపికైన 700 మంది లబ్ధిదారులు సైతం వివిధ మార్గాల ద్వారా అధిక వడ్డీలకు రుణాలు తీసుకొని వ్యాపారాలు ప్రారంభించారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ప్రభుత్వం నుంచి నిధుల విడుదల పూర్తిగా నిలిచిపోయింది. లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ సంక్షేమ పరిషత్ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాశారు. కనీసం రూ.50 కోట్లు విడుదల చేస్తే ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులకు ఇచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

ఇతర పథకాలకూ నిలిచిన నిధుల విడుదల

గత కేసీఆర్ ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమం కోసం వివిధ పథకాల ద్వారా దాదాపు రూ.230 కోట్లు ఖర్చుచేసింది. బెస్ట్, విదేశీ విద్యానిధి పథకంతోపాటు వేద/శాస్త్ర పండితులకు గౌరవవేతనం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, సంప్రదాయ వేద పాఠశాలలకు ఆర్థిక సహాయం, పేద విద్యార్థుల కోసం రామానుజ ఫీ రీ యింబర్స్‌మెంట్ తదితర పథకాలను అమలుచేసింది. ఆయా పథకాలకు కూడా గత మూడు నెలలుగా నిధులు విడుదల కాలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పరిషత్తు భవిష్యత్ అయోమయంలో పడింది. గత పాలకమండలి రద్దుకాగా, పాలనాధికారి సైతం మంత్రి శ్రీధర్‌బాబు పేషీ అధికారిగా చేరారు. దీంతో బ్రాహ్మణ పరిషత్తు కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం నిధులు విడుదల చేసి సంక్షేమ పరిషత్‌ను ఆదుకోవాలని వివిధ బ్రాహ్మణ సంఘాలు కోరుతున్నాయి.

అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం

- ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఆటోడ్రైవర్లను రెచ్చగొట్టి ధర్నాలు చేయిస్తున్నారని, అసత్య ప్రచారాలు చేస్తే ఉరుకోబోమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. చట్టాలకు లోబడి వ్యవహరించకపోతే మాజీ మంత్రులు అని కూడా చూడబోమని అన్నారు. సచివాలయం మీడియా సెంటర్‌లో సోమవారం మంత్రి పొంగులేటితో కలిసి మీడియాతో మాట్లాడుతూ తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, నైతిక విలువలకు తిలోదకాలు ఇస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్రం కోసం తాము రోడ్డెక్కి ఆందోళనలు చేశామని చెప్పారు. తాము ధర్నా చౌక్‌ను ఓపెన్ చేశామని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలుపుకోవాలని అన్నారు. తమ హామీలు కచ్చితంగా అమలు చేస్తామని, నెల పూర్తయింది అప్పుడే అంత తొందరెందుకు అంటూ ప్రశ్నించారు. గతంలో ఆటో వాళ్లకి ఇబ్బందులు లేవా? అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. తమకు రాఖీ కట్టిన కరీంనగర్ సోదరిని వాట్సాప్ యూనివర్సిటీలో అవమానపర్చారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

'ప్రజాపాలన'పై సబ్‌కమిటీ

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల అమలు, లబ్ధిదారుల ఎంపిక కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో క్యాబినెట్ సబ్‌కమిటీ వేసినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా అందిన దరఖాస్తులను 30లోగా డాటా ఎంట్రీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సీఎం అధ్యక్షతన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై సోమవారం సచివాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. సీఎస్ శాంతికుమారి దరఖాస్తులు, డాటా ఎంట్రీ వివరాలను సీఎంకు తెలిపారు. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్ మీడియాకు ఆ వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 13శాతం ఎంట్రీ పూర్తయిందని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటితో ఏర్పాటుచేసిన కమిటీ లబ్ధిదారుల ఎంపిక, మార్గదర్శకాలను ఖరారు చేస్తుందని తెలిపారు. ఈ కమిటీలో ఉన్నతాధికారులు కూడా ఉంటారని చెప్పారు. కమిటీ రూపొందించిన మార్గదర్శకాలను క్యాబినెట్ చర్చించి తుది నిర్ణయం తీసుకుంటుందని వివరించారు.

కాంగ్రెస్ టార్గెట్ 12 ఎంపీ సీట్లు

- 26 తర్వాత జిల్లాల పర్యటన
- ఇంద్రవెల్లి నుంచే శ్రీకారం
- ఎమ్మెల్యేలకు 3 రోజులు కేటాయిస్తా
- ఐదు ఉమ్మడి జిల్లాల్లోని ఎంపీ సీట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం 12 ఎంపీ సీట్లు సాధించడం కాంగ్రెస్ పార్టీ టార్గెట్ అని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో కష్టపడాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికలపై సోమవారం సాయంత్రం ఎంసీహెచ్చార్డీలో సంబంధిత జిల్లా మంత్రులు, పార్లమెంట్ ఎన్నికలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ఇటీవలి ఎన్నికల్లో ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలిరోజు ఉమ్మడి హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలోని లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో చర్చించారు. మంగళవారం మరో ఐదు ఉమ్మడి జిల్లాల్లోని ఎంపీ స్థానాలపై సమీక్ష నిర్వహించనున్నారు. సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు ప్రజలను, పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ఈ నెల 26 నుంచే జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టబోతున్నట్టు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసభ నిర్వహించిన ఇంద్రవెల్లి నుంచే జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతానని చెప్పారు. ఇంద్రవెల్లిలో అమరుల స్మారక స్మృతి వనం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తామని, అందుకు ఏర్పాట్లు చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలకు సూచించారు. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను గుర్తించి ఆదుకుంటామని పేర్కొన్నారు. ఈ నెల 26 తర్వాత సచివాలయంలో వారానికి 3 రోజులపాటు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. శాసనసభ నియోజకవర్గాల అభివృద్ధి, సంక్షేమం బాధ్యతలు ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీ మంత్రులదేనని స్పష్టం చేశారు.

సరిపడా ఎరువులు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

హైదరాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ): అవసరం మేరకు ఎరువులను సరఫరా చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎరువుల నిల్వలపై సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత యాసంగితో పోల్చితే అధిక ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గత యాసంగిలో ఈ రోజు నాటికి 3.57 లక్షల టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉండగా, ఈసారి మాత్రం 4.68 లక్షల టన్నులను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అదే ఇతర ఎరువులు నిరుడు 7 లక్షల టన్నులు ఉండగా, ప్రస్తుత 9 లక్షల టన్నులు ఉన్నట్టు వివరించారు. పంటల రకాలు, రైతుల అవసరాల మేరకు ఆయా ప్రాంతాల్లో అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మేడారంలో 50 బెడ్లతో తాత్కాలిక దవాఖాన

- మంత్రి రాజనర్సింహ ఆదేశాలు

హైదరాబాద్, జనవరి8 (నమస్తే తెలంగాణ): సమ్మక్క, సారక్క జాతరకు వచ్చే భక్తుల కోసం మేడారంలో తాత్కాలికంగా 50 బెడ్ల దవాఖాన (సమ్మక్క సారక్క వైద్యశాల)ను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న మేడారం జాతర ఏర్పాట్లపై, తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలోని తన కార్యాలయంలో సోమవారం వైద్య, ఆరోగ్య, ఆయుష్, ఫుడ్ సేఫ్టీ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారంలోని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 6 బెడ్లతో, ప్రత్యేక వైద్యులతో కూడిన వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, జాతర పరిసరాల్లో 30, మేడారం వెళ్లే వివిధ రూట్లలో మరో 42 వైద్య శిబిరాల ను ఏర్పాటు చే యాలని ఆదేశించారు.

నల్లగొండలో అవిశ్వాస తీర్మానం సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

కాంగ్రెస్‌కు జైకొట్టిన బీజేపీ

- నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం
- ఇబ్రహీంపట్నంలో 'నో కాన్ఫిడెన్స్'

నల్లగొండ ప్రతినిధి/ఇబ్రహీంపట్నం, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఏ పార్టీకి ఎవరు బీటీమ్ అనే విషయం సోమవారం తేటతెల్లమైంది. కాంగ్రెస్‌కు బీజేపీ బీటీమ్ అన్న విషయం నల్లగొండ వేదికగా తేలిపోయింది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కటై మున్సిపల్ సమావేశానికి వచ్చారు. నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి (బీఆర్ఎస్)కి వ్యతిరేకంగా కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మొత్తం 41 మంది సభ్యులు చేతులు ఎత్తగా, ఐదుగురు బీఆర్ఎస్ సభ్యులు వ్యతిరేకంగా, ఒకరు తటస్థంగా వ్యవహరించారు. మ్యాజిక్ ఫిగర్‌కు మించి ఓట్లు రావడంతో సైదిరెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కాంగ్రెస్ ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి ఐదుగురు బీజేపీ సభ్యులు కూడా మద్దతు పలికారు. బీజేపీకి మొత్తం ఆరుగురు సభ్యులు ఉండగా ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్ మీటింగ్‌కు హాజరు కాలేదు. మిగతా ఐదుగురు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచి అవిశ్వాసాన్ని నెగ్గించుకున్నారు. మరోవైపు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై సోమవారం బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు పలువురు అవిశ్వాసం పెట్టాలంటూ 17మంది కౌన్సిలర్లు జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.

సీఎమ్మార్ వేగవంతం చేయాలి

- 31లోగా లక్ష్యం పూర్తి కావాలి
- కలెక్టర్ల వీసీలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌సీఐకి బియ్యం (సీఎమ్మార్) ఇచ్చేందుకు ధాన్యం మిల్లింగ్‌ను వేగవంతం చేయాలని, గడువులోపు లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సీఎమ్మార్‌పై సోమవారం సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి మంత్రి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 31లోగా సుమారు 43 లక్షల టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అందించాల్సి ఉంటుందని చెప్పారు. గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయని పక్షంలో సదరు అధికారులపై, మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్లు, అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే పౌరసరఫరాల సంస్థకు భారీ నష్టం వాటిల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బియ్యం కావాలని అడుగుతున్నప్పటికీ వాటిని సమకూర్చడంలో రాష్ట్రంలో సరిగ్గా పని చేయడం లేదని చెప్పారు. ఈ నిర్లక్ష్యం వల్లే సంస్థ రూ. 56 వేల కోట్ల అప్పుల్లో, రూ.11 వేల కోట్ల నష్టాల్లో కూరుకుపోయిందని మండిపడ్డారు. మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ చేసి సీఎమ్మార్ కింద ఇస్తున్నారనే ఫిర్యాదులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రేషన్ షాపులకు ఇచ్చే బియ్యంలో బస్తాకు 4-5 కేజీలు తక్కువగా వస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించారు.

బిల్ట్ పునరుద్ధరణ!

మొదటిపేజీ తరువాయి...

పేపర్ బోర్డ్స్ డివిజన్ సీఈవో వాదిరాజ్ కులకర్ణితోసమావేశమయ్యారు. బిల్ట్ ఆస్తులు ప్రస్తుతం ఫిన్‌క్వెస్ట్ సంస్థ ఆధీనంలో ఉన్నాయి. ఈ సందర్భంగా సీఎం వారితో బిల్ట్ మిల్లును పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తరపున తీసుకోవాల్సిన చర్యలు, సాధ్యాసాధ్యాలను వారితో చర్చించారు. కమలాపురంలోని బిల్ట్ మిల్లులో వస్త్రాల తయారీకి ఉపయోగించే కలప గుజ్జును తయారు చేస్తారు. ఈ మిల్లు 2014లో మూతపడింది. దీంతో దాదాపు 750 కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. వీరందరితోపాటు స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ఈ మిల్లును పునఃప్రారంభించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారు.

బిల్ట్ ఆస్తుల కొనుగోలుకు ఐటీసీ ఆసక్తి

మరోవైపు బిల్ట్ ఆస్తుల కొనుగోలుకు ఐటీసీ కంపెనీ ఆసక్తి చూపుతున్నది. ఐటీసీతో చర్చల ప్రక్రియను వేగవంతం చేయాలని ఫిన్‌క్వెస్ట్ కంపెనీని సీఎం కోరారు. బిల్ట్ మిల్లును పునరుద్ధరించే ప్రక్రియలో ఐటీసీకి అన్ని విధాలా ప్రభుత్వ సహకారం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

సీఎంతో కోకాకోలా ప్రతినిధిబృందం భేటీ

ప్రముఖ శీతల పానీయాల తయారీ సంస్థ హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు ముందుకొచ్చింది. కంపెనీ ప్రతినిధి బృందం సోమవారం సచివాలయంలో సీఎం కలిసి తమ సంస్థ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించింది. రాష్ట్రంలో కొత్త ప్లాంట్ల ఏర్పాటుపై కంపెనీ ప్రతినిధులు ఆసక్తి వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కోకాకోలా దాదాపు రూ.3 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టింది. సిద్దిపేట జిల్లాలోని బండ తిమ్మాపూర్‌లో తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ బాట్లింగ్ ప్లాంట్ నిర్మాణంలో ఉంది. పెట్టుబడులకు రక్షణ కల్పించటంతోపాటు పరిశ్రమల స్థాపనకు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి భరోసా ఇచ్చారు. కంపెనీల ఏర్పాటుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు రాష్ట్రంలో సులభ వాణిజ్య విధానం అమల్లో ఉంటుందని అన్నారు. హెచ్‌సీసీబీ ప